# పిల్ల

## తులసి బాలకృష్ణ

అన్నీ తెలుసుననుకొనే అహంభావాన్నికంటే ఏమీ తెలియని అమాయకత్వాన్నే మొదట్నుంచీ యిష్టపడతాడు సత్యమూర్తి. అందుకనే ఏరికోరి పల్లెటూరి పిల్ల నిర్మలని పెళ్ళాడాడు.

అమాయకపు కళ్ళలోని భావాల్ని చదవ ప్రయత్నించడంలోని ఆనందం లిప్‌స్టిక్ పెదవుల్ని గాఢంగా చుంబించటంలో వుండదంటాడు.

పల్లెటూరి పిల్లకు నగరంలోని వింతల్ని చూపించడం హీరోయిజంగా ఫీలవుతూ, టాంక్‌బండ్ మీది సోఫాలో కూర్చుని పరిసరాల అందాన్ని వివరించి చెప్తున్నాడు—

"హైద్రాబాదుకి రావడం నీకిదే మొదటిసారి కాబట్టి, ఇదంతా చూస్తూంటే నీకు భలే వింతగా వుందికదూ?"

సిగ్గుతోకూడిన నవ్వుతో వంచిన తలని ఆడించింది నిర్మల.

"ఇంటికి వెళ్ళేటప్పుడు ఎంత ఆలస్యమయినా సరే డబుల్‌డెక్కర్‌లోనే వెళ్దాం. పైన ఎక్కితే కొత్తవాళ్ళకి భలే తమాషాగా వుంటుంది. మీ బండార్లంకలో డబుల్‌డెక్కర్లే వీఁటి, అసలు సిటీబస్సులే వుండవుగా?" అన్నాడు ఆమె చుబుకంపట్టి, ముఖం పైకి ఎత్తి, కళ్ళల్లోకి చూస్తూ నవ్వి.

నవ్వింది నిర్మల.

"ఇదేం సిగ్గు పిల్లా—పెళ్ళయ్యాక కూడా పెళ్ళి చూపుల్లోలాగ సిగ్గుపడితే యెలా?"

ఈసారి సత్యమూర్తి కళ్ళల్లోకి చూసి నవ్వింది నిర్మల.

ఆనందంతో సత్యమూర్తి హృదయం వుప్పొంగి, హుసేన్‌సాగర్ అంత అయ్యింది.

"చూడు నిర్మలా—ఈ చెరువుని హుసేన్ సాగర్ అంటారు. అదుగో ఆ కొండమీద కనిపిస్తోందే — పాలరాతి దేవాలయం—అది బిర్లామందిరం. ఆ ప్రక్కగా...."

—సోఫాకి జేర్లాపడి కూర్చుని, వేరుసెనగ పలుకులు ఒక్కొక్కటే నోట్లో వేసుకుంటూ, ఆగకుండా చెప్పుకుపోతున్న భర్త ముఖంలోకి తదేకంగా చూస్తూ వింటోంది నిర్మల.

... తన భర్త అందంగా వుంటాడు. తెల్లని తెలుపు కాకపోయినా ఆకర్షణీయంగా వుంటుంది అతని ముఖం. రింగులు తిరిగిన జుట్టు కాదు గానీ అడ్డంగా నుదుటిమీదుగా దువ్విన క్రాపు అతని నిర్మలాకర్షణీయమైన ముఖానికి క్రొత్త అందాన్నిచ్చి, చూపరులకు అతనంటే మరింత గౌరవాన్ని పెంచేదిగా వుంది. చిన్న గుండ్రని చుబుకం, పల్చని చెంపలు. నవ్వినప్పుడు వాటిపైపడే సొట్టలు ముద్దొస్తుంటాయి. కండలు తిరిగిన శరీరం కాదు సత్యమూర్తిది—కాని పుష్టిగా నిండుగా వుంటుంది. అతని కంఠంలో గంభీరతకంటే మాధుర్యం యెక్కువగా ధ్వనిస్తుంది....

హుసేన్ సాగర్ చుట్టూ వున్న యితర ప్రదేశాల గురించీ, తాము సోఫాలో కూర్చుని వున్న ప్రదేశం టాంక్‌బండ్ గురించీ చెప్పుకుపోతున్నాడు సత్యమూర్తి. ప్రేమగా అతని ముఖంలోకే చూస్తూ, కొసరుకొసరుగా సిగ్గు విడిచి పెడుతూ భర్తవైపు జరుగుతూన్న నిర్మల—

—సోఫా వెనకే నిటారుగా, సరిగ్గా సత్యమూర్తికీ తనకీ మధ్యగా వెనగ్గా, నిల్చున్న ఆరడుగుల నాలుగంగుళాల జబర్దస్తీ మనిషి ఖుస్రూని చూసి, అదిరిపడింది. కెవ్వున అరవలేకపోయిందికూడా.

భార్య ముఖంలోకే చూస్తూన్న సత్యమూర్తి చటుక్కున వెనక్కితిరిగి, భయభ్రాంతుడయ్యాడు. అంతలోనే తమాయించుకుని,

భార్యకు దగ్గరగా జరిగి, ఆమె ముఖాన్ని హుసేన్‌సాగర్ వైపు త్రిప్పి, ఏవో మాటలు పొడిగించాలని ప్రయత్నించాడుగాని, గొంతు ఓ పట్టాన పెగల్లేదు. ఆమెకూడా తేరుకోలేదు.

ఖుస్రూ చిన్నగా నవ్వుకున్నాడు. అప్రయత్నంగా మీసం కొసని పైకి తోసాడు. నెమ్మదిగా వచ్చి, సోఫామీద నిర్మల ప్రక్కగా కూర్చున్నాడు.

గబుక్కున ఒకేసారి లేచి నిలబడ్డారు సత్యమూర్తి, నిర్మల. గబగబా నడుస్తూ కొంత దూరం పోయేక ఖాళీగా వున్న ఒక సోఫాలో కూర్చున్నారు. ఇద్దరి గుండెలూ దడదడలాడుతున్నాయి. భార్యతో సమానంగా తనూ భయపడుతున్నందుకు సిగ్గుపడ్డాడు సత్యమూర్తి. పైగా ఇలా మౌనంగానే వుంటే భార్య మరీ భయపడుతుంది. బలవంతపు నవ్వు తెరొకటి ముఖంమీదకి జార్చుకున్నాడు.

"అక్కడ కంటే ఇక్కడే బావుందికదూ నిర్మలా" అన్నాడు.

అవునన్నట్లుగా గబగబా తలూపింది నిర్మల. ఒకసారి గబుక్కున వెనక్కి తిరిగి చూసిందికూడా. ఏమీ 'జరగనట్లుగా నటించడానికి ప్రయత్నించసాగింది.

నవ్వుతెర రంగు వెలియకుండా జాగర్త పడుతూ హైద్రాబాదు విశేషాలు చెప్పుకుపోతున్నాడు సత్యమూర్తి. భర్తకి పూర్తిగా అనుకుని కూర్చుని, అతని చేతివేళ్ళతో ఆడుకుంటూ అతన్నే చూస్తూ అతని మాటలు వింటూన్న నిర్మల——

——భర్త మాటలు ఆపి, తన వెనగ్గా భయంగా చూస్తూండడం గమనించి, చటుక్కున వెనుతిరిగి నిర్విణ్నురాలై పోయింది.

అలవోకగా నవ్వుతూ వచ్చి నిర్మలప్రక్కనే కూర్చున్నాడు ఖుస్రూ.

గొంతు తడారిపోయి, వేగంగా కొట్టుకుంటూన్న గుండెలతో, బిగుసుకుపోయి ఒకరినొకరూ చూసుకుంటూ కూర్చుండిపోయేరు భార్యాభర్తలు.

సత్యమూర్తి మనస్సు మెలికలు తిరుగుతోంది. తను భయపడుతున్నట్లు భార్యకు ఏమాత్రం తెలిసినా తనని చులకన భావంతో చూస్తుంది. మరింత ఆమె బెంబేలు పడిపోతుంది.

నిర్మల కంగారుగా నుదుటిమీది చెమటను తుడుచుకుంది. భయపడనట్లు నవ్వ ప్రయత్నించింది. భర్తమీద తనకి చులకన భావం కలుగుతోందని అనుకునే అవకాశం యివ్వకూడదని సత్యమూర్తి ముఖంలోకి వీలయినంత ప్రేమగా చూడసాగింది.

"రేపు మనం జూపార్క్‌కి వెళ్దాం. దార్లో చార్‌మీనార్ కూడా చూపిస్తా" - ఏదో మాట్లాడాలని మొదలుపెట్టాడు సత్యమూర్తి ఖుస్రూ వైపే చూస్తూ.

నెమ్మదిగా, పొగరుగా నిర్మలవైపు జరగసాగాడు ఖుస్రూ. వాడి పెర్సనాలిటీ సత్యమూర్తిని భయపెడ్తోంది.

నిర్మల భర్తని అంటిపెట్టుకుని కూర్చుంది.

'ఎవడీ కీచకుడు?!! ఎందుకు తమనిలా వెంబడిస్తున్నాడు?!'

ఇవే ప్రశ్నలు ఇద్దర్నీ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

వాడ్ని యేదో చేసెయ్యాలన్న కోపం. ఏమీ చెయ్యలేని అసమర్ధత. తాము భయపడుతున్నామని వాడు గ్రహిస్తే మరింత రెచ్చిపోతాడేమో నన్న అనుమానం.

అటూ, ఇటూ అనేకమంది పోతూనే వున్నారు. అందరూ చూస్తూనే వున్నారు. గబుక్కున మొహాలు త్రిప్పేసుకుని వెళ్ళిపోతున్నారు.

టాంక్‌బండ్ మీద స్థానిక రౌడీలుగా పేరు మోసిన గ్యాంగ్‌లు సైతం ఎత్తిన కాలర్లుదించి పిల్లుల్లా జారుకుంటున్నారు.

ఖుస్రూ అంటే, వాడి పెర్సనాలిటీ అంటే, వాడి వెనకవున్న మద్దతు అంటే, వాడి గత చరిత్ర అంటే——ఆ లోకాలిటీలో వున్న భయంకరమైన భయం ఎవర్నీ ముందడుగువేసి, వాడి చేతుల్లోంచి శాంతి పావురాల్ని రక్షించే శక్తిని యివ్వదు.

"నిర్మలా! మరేం ఫర్వాలేదు .... భయ పడకు...." గొంతు పెగల్చుకుని రహస్యంగా గొణిగాడు సత్యమూర్తి భార్యని పొదివి పట్టు కుని.

"అబ్బెబ్బె.... ఉఁ.... భయందేనికి...."

"నీ ప్రక్కన ఎవడో రౌడీ వెధవ కూర్చు న్నాడు కదూ. వాడ్నిచూసి నువ్వేమైనా భయ పడుతున్నావేమోనని...."

"ఛఛ....ఏం లేదు...ఇంతమంది తిరుగు తూండగా .... అందులో మీరుండగా నాకేం భయం" ధైర్యంగా నవ్వుతూ అంది.

కళ్ళలో నీళ్ళు తిరిగినంత పనయ్యింది సత్య మూర్తికి ఆమెమీద ప్రేమతో. బలంగా గుండెలు ఉబికి, రెండు క్షణాలకు పల్చబడి పోయేయి. అయినా ధైర్యం ప్రకటిస్తూ, వాడ్ని లెక్కచెయ్యనట్లు నటిస్తూ, భార్యతో మాటలు పొడిగించబోయేడు. కాని ఇంతలో—

—నిర్మల భుజంమీద ఖుస్రూ చెయ్యి మోటుగా పడింది.

ఉలిక్కిపడ్డారిద్దరూ. భయంతో, అవమా నంతో వణవణ వణికిపోయేరు.

'కీచు' మంటూ బ్రేకులు పడుతూండగా



వెనగ్గా రోడ్డుమీద ఆగిన సిటీబస్సు ఆపద్బాంధవుడిలా కనిపించింది యిద్దరికీ. నాలుగు కళ్ళు మెరిసాయి. వెంటనే అనుకున్నవారిలా రివ్వున లేచి బస్సువైపు పరిగెత్తాడు.

"నిర్మలా! నువ్వు ముందునుంచి యెక్కు. ముందునుంచి నేనెక్కకూడదు. వెనకనుంచి యెక్కి ముందుకొస్తా. ధైర్యంగా వుండు. గబగబా యెక్కు" అని అరిచినట్లు అని, బస్సెక్కాడు సత్యమూర్తి వెనగ్గా.

పరిగెట్టి, ముందుకి తూలి పడబోయి, నిలదొక్కుకుని, బస్సెక్కెయ్యగలిగిన నిర్మల సీటులేక జనం మధ్య నిలబడిపోయి, భర్త కోసం వెనక్కి జనం మధ్యగా చూడసాగింది.

ముందునుంచి బస్సెక్కబోయిన మగవాడిని, "పీఛేసే ఆవ్...." (వెనకనుంచి రా) అని కసరబోయిన డ్రైవరు, ఆ మనిషిని గుర్తుపట్టి, మొహంనిండా నవ్వుతూ, "అయియే ఖుస్రూ సాబ్....ఆయియే...." అని ఆహ్వానించాడు. నవ్వుతూ లోపలకివస్తూన్న ఖుస్రూని చూసి భయంతో బిగుసుకుపోయింది నిర్మల.

జనాన్ని తప్పించుకుని ముందుకు భార్య దగ్గరకు వెళ్ళడానికి ఎంత ప్రయత్నిస్తున్నా సత్యమూర్తికి వీలుకావడంలేదు.

నిర్మలకు తగుల్తూ నిల్చున్నాడు ఖుస్రూ.

ముడివేసినట్లు ముడుచుకుపోయి నిల్చుంది నిర్మల.

ఒక సీట్లోని యిద్దరు ఆడవాళ్ళు లేచి, దిగిపోయేరు. 'బ్రతుకు జీవుడా' అని గబుక్కున ఆ సీట్లో కిటికీ వారగా కూర్చుని, వేరే మరో ఆడ మనిషిని తన ప్రక్కన కూర్చోమని నిర్మల ఆహ్వానించే లోగా, అసహ్యంగా నవ్వుతూ ఖుస్రూ అందులో కూలబడ్డాడు.

చటుక్కున లేచి నిల్చుంది నిర్మల.

కాళ్ళు అడ్డుపెట్టి కూర్చున్నాడు ఖుస్రూ.

ఆడ మగా అంతా వింతగా చూస్తున్నారు. కండక్టరు ఖుస్రూని చూసి, గబగబా వెనక్కి వెళ్ళిపోయేడు. డ్రైవరుకి వెనక జరుగుతున్న ఘోరం తెలుసును కాబట్టి, వెనక్కి తిరిగి చూసే ధైర్యంలేక ముక్కుసూటిగా చూస్తూ పోనిచ్చాడు బస్సుని.

జనాన్ని తప్పించుకుని సత్యమూర్తి భార్య సీటువద్దకు చేరేసరికి — బస్సు ఆఖరి స్టాప్ చేరుకుంది. బస్ అంతా ఖాళీ అయిపోయింది. ఖాళీ అవనిది ఖుస్రూ కూర్చున్న సీటు ఒక్కటే. ప్రక్కన మూలలో బలిపశువులా నిర్మల నిల్చుని వుంది. రెండవ ప్రక్క దోషిలా సత్యమూర్తి నిల్చునివున్నాడు.

"మేస్టారూ! మీరు కొంచెం కాళ్ళు అడ్డు తీస్తారా, నా భార్య బయటకు వస్తుంది" అన్నాడు సత్యమూర్తి, ఖుస్రూతో—విన్నవించుకుంటున్నట్లుగా.

అరమోడ్పు కన్నులతో సత్యమూర్తిని చూసిన ఖుస్రూ చిన్నగా నవ్వడం మొదలుపెట్టి, క్రమేపీ పెంచుతూ, బండరాళ్ళు దొర్లిస్తున్న ధ్వనితో భయంకరంగా, విజయగర్వంగా ఒక నవ్వు నవ్వి, కిటికీలోంచి బస్సు బయటకు చూసాడు. బస్సు చుట్టూ అనేకమంది సినిమా చూస్తున్నట్లు కళ్ళు విప్పార్చి చూస్తున్నారు. ఖుస్రూ మళ్ళీ నవ్వి, నిర్మలని ఆపాదమస్తకం చూడసాగాడు.

ఉన్నపళంగా గుండె ఆగి చచ్చిపోతే బాగుండును అనిపిస్తోంది భార్యాభర్తలిద్దరికీ.

బయట జనంలో వీళ్ళమీద జాలిపడ్తున్న వాళ్ళు, జరుగుతున్న సంఘటనని వినోదంగా భావించి ఆనందిస్తూన్న వాళ్ళూ వున్నారు.

సత్యమూర్తి మళ్ళీ విన్నవించుకున్నాడు ఖుస్రూకి.

ఉరుముతున్నట్లు, పిడుగులు కురుస్తున్నట్లు మళ్ళీ నవ్వాడు ఖుస్రూ.

చుట్టూ చూసాడు సత్యమూర్తి. బస్సంతా ఖాళీ. బస్సు చుట్టూ తీర్థజనంలాగ అనేకమంది ఇటే చూస్తున్నారు.

అవమాన భారంతో తల వంచుకొంది నిర్మల.

ముఖం నిండా పొటమరించిన స్వేదధారలతో, బయటకు వినిపించే ధ్వనితో కొట్టుకుంటూన్న గుండెలతో, వణుకుతూన్న పెదవులతో, గొంతులో కొట్టుమిట్టాడుతున్న దుఃఖంతో సత్యమూర్తి నిలబడి వున్నాడు. మరొకసారి

విన్నవించుకున్నాడు ఖుస్రూకి కాళ్ళు అడ్డు తియ్యమని.

ఖుస్రూ తలెత్తి సూటిగా సత్యమూర్తి కళ్ళ ల్లోకి చూసాడు.

"క్యారే .... క్యా .... క్యా బోల్రా రేతూ? ఆఁ—ఐసీ బుల్‌బుల్ కూ ఛోడ్ దేనా...." అని నవ్వి, "ఆజ్ రాత్‌కూ ఖుషీ కర్తూం ఏ పోట్టీకే సాత్. తూ జాబే జా...." అని సత్య మూర్తిని బలంగా ఒక్క తోపు తోసాడు.

విసురుగా వెళ్ళి వెల్లకిలా పడ్డాడు సత్య మూర్తి.

చటుక్కున తలెత్తి భర్తవైపు చూసిన నిర్మల కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

పగలబడి నవ్వుతూ ప్రక్కకు తిరిగి నిర్మల చెయ్యి పట్టుకున్నాడు ఖుస్రూ.

అంతే!!

మనిషి అహం దెబ్బతింది.

అవమానాగ్ని కామారణ్యాలమీదకు విరుచుకు పడింది.

అన్నివైపులా తలుపులు బిగించి వున్నాయి అని తెలుసుకున్న పిల్లి యెదురు తిరిగింది.

అగ్నిపర్వతం బ్రద్దలై ప్రళయఘోషతో తన్నుకొచ్చింది లావా.

భగభగ మండుతున్న గుండెలు భళ్లున దావానలాన్ని కక్కేయి.

మంచుకి తడిసిన లేగులాబి మొగ్గలాంటి నిర్మల అపరకాళిగా మారింది. శాంతానికి మారురూపం, శాంతికపోతం లాంటి సత్య మూర్తి ప్రళయకాలరుద్రుడయ్యాడు.

నోటికొచ్చినట్లు శపిస్తూ తన ముంజేతితో ఖుస్రూ మొహంమీద ఎడతెరిపి లేకుండా కొట్ట సాగింది నిర్మల.

బంతిలా లేచొచ్చి, బలంగా ఖుస్రూ పొత్తి కడుపులో తన్నసాగాడు సత్యమూర్తి.

ఊహించని ఈ పరిణామానికి ఉక్కిరి బిక్కిరై, తట్టుకుని, తిరగబడేలోగా—

"అల్లా!.... ఆంఖే.... మేరా ఆంఖే...."

—కోటి డప్పులు ఒక్కసారిగానే మ్రోగించినంత ధ్వనితో పెడబొబ్బలు పెడ్తూ లేచి, పిచ్చిపట్టిన వాడిలా ఇటూ అటూ సీట్లను పట్టుకుంటూ, గుద్దుకుంటూ గుమ్మంవద్దకొచ్చి పడిపోయేడు ఖుస్రూ.

వాడి రెండు కళ్ళల్లోనూ నిర్మల చేతి గాజు ముక్కలు బలంగా దిగబడిపోయేయి. వేరొక చేత్తో పొత్తికడుపు నొక్కిపట్టుకుని మెలికలు తిరుగుతూ, దొర్లుతూ, అరుస్తున్నాడు వాడు.

బస్సు చుట్టూ వున్న జనంలో చలనం కలిగింది.

పిరికి వెధవలకి సైతం ధైర్యం వచ్చింది. పరుగుపరుగున ముందుకు వచ్చి, ఖుస్రూని బస్సు బయటకు ఈడ్చేశారు.

"తగిన శాస్తి జరిగింది వెధవకి. ఇంక జీవితాంతం గుడ్డిబ్రతుకే."

—ఇవేమాటల్ని వివిధ తరహాల్లో అందరూ ఆనందం వెల్లబుచుకుతూండగా అనుకున్నారు.

"ఈ యెదవపన్లు ఈడు గత అయిదేల్లుగా సేత్తూనే వున్నాడు. సంపేత్తాదేమో ననే భయంతో ఒక్క యెదవకూడా యిన్నాల్లూ ఆడ్ని ఏఁవఁనలేకపోయారు. ఈ రోజున పార్వతీ పరమేశ్వరులే దిగొచ్చి ఆడి కల్లు పీకేశారు" అంటూ నసుగుతున్నట్లు అంటోంది ఒక ముసల్ది వారగా నిల్చుని.

"మా స్టూడెంట్స్ యూనియన్ తరఫున యిప్పటికి రెండుసార్లు వార్నింగ్ యిచ్చాను కూడా వీడికి. రేపో యెల్లుండో వీడి భరతం పడదామని అనుకుంటున్నాం మేష్టారూ. ఇంతలో మీరే బుద్ధిచెప్పారు వీడికి" అన్నాడొక వస్తాదులాంటి యువకుడు చొక్కాచేతులు మడుచుకుంటూ.

రిక్షావాడొకడు ఆ యువకుడివైపు జాలిగా నవ్వేడు, "వెర్రి మొహవాఁ" అన్నట్లుగా.

కళ్లుపోయి రోడ్డు వారగా పడివుండి, అరుస్తూన్న ఖుస్రూనిగాని, ఆనందిస్తూన్న జనాన్ని గాని, తమని పొగుడ్తూన్న చుట్టూ వున్నవారిని గాని గమనించే స్థితిలో లేరు ఇద్దరు—సత్య మూర్తి, నిర్మల.

ఒకరి ముఖాల్లోకి ఒకరు అత్యంత ప్రేమగా చూసుకున్నారు.

చెదిరిన జుట్టుని, బట్టల్ని సర్దుకున్నారు.

నడుం చుట్టూ చేతులు వేసుకుని, ఆనందంగా, మనసులతో అభినందించుకుంటూ నడుచుకు వెళ్ళిపోయేరు. □